మహువా మొయిత్రాపై ఈడీ కేసు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మహువా మొయిత్రాకు మరిన్ని చిక్కులు ఎదురవుతున్నాయి. ఆమెపై మంగళవారం ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) ఉల్లంఘన కేసులో ప్రశ్నించేందుకు ఆమెకు ఈడీ ఇటీవల సమన్లు జారీ చేసింది. అయితే ఆమె విచారణకు హాజరుకాలేదు. నాన్ రెసిడెంట్ ఎక్స్‌టర్నల్, లేదా ఎన్ఆర్ఐ ఖాతాకు లింక్ చేసిన లావాదేవీలపై ఈడీ ఆమెను ప్రశ్నించాలని కోరింది. మహువా మొయిత్రా ఈ విషయంలో తాను ఏ తప్పు చేయలేదని ఖండించారు. పార్లమెంట్‌లో ఆవేశపూరిత చర్చలకు పేరుగాంచిన మహువా.. ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రశ్నలు అడగటానికి బహుమతులు అందుకున్నదని పార్లమెంటరీ ఎథిక్స్ కమిటీ నివేదిక ఇవ్వటంతో గత డిసెంబర్‌లో ఆమెను సభ నుంచి బహిష్కరించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లోని కృష్ణానగర్ స్థానం నుంచి మహువా పోటీచేస్తున్నారు.

ఇమ్రాన్‌ఖాన్ భార్యపై విషప్రయోగం!

పాక్ మాజీ ప్రధాని ఆరోపణ

ఇస్లామాబాద్: తన భార్య బుష్రా బీబీపై విషప్రయోగం జరిగిందని పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ఆరోపించారు. ప్రస్తుతం ఆయన పాక్ జైల్లో శిక్షను అనుభవిస్తున్నారు. తన భార్యను ప్రైవేట్ నివాసంలో నిర్బంధించారని, దానిని సబ్‌జైల్‌గా మార్చారని ఆరోపించిన ఖాన్.. ఆమెకు ఏమైనా జరిగితే ఆర్మీ చీఫ్ బాధ్యత వహించాలన్నారు. తన భార్యపై విష ప్రయోగం జరిగిందని, అందుకు ఆధారాలున్నాయని జడ్జికి తెలియచేశారు. కాగా, ఇమ్రాన్ భార్య బుష్రా మాట్లాడుతూ తాను అమెరికన్ ఏజెంట్ అని పుకార్లు పుట్టించారని, తన ఆహారంలో టాయిలెట్ క్లీనర్ కలిపారని ఆరోపించారు.

బీజేపీలో చేరతావా? అరెస్టు అవుతావా?

- నన్ను ప్రలోభ పెట్టాలని ఓ వ్యక్తి ద్వారా బీజేపీ సంప్రదించింది
- నాతో సహా నలుగురు ఆప్ నాయకులను అరెస్టు చేస్తారు
- ఢిల్లీ రాష్ట్ర మంత్రి ఆతిశీ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: ఆప్ కీలక నాయకురాలు, ఢిల్లీ మంత్రి ఆతిశీ సంచలన విషయాలు బయటపెట్టారు. బీజేపీలో చేరకపోతే నెల రోజుల్లో ఈడీ ద్వారా అరెస్టు అయ్యేందుకు సిద్ధంగా ఉండాలని ఓ వ్యక్తి ద్వారా బీజేపీ తనకు చెప్పించిందని ఆమె తెలిపారు. మంగళవారం ఢిల్లీలో ఆమె మీడియాతో మాట్లాడుతూ... త్వరలో తన ఇల్లు, తన సన్నిహితుల ఇండ్లలో ఈడీ సోదాలు చేపట్టబోతున్నదని, ఆ తర్వాత తనకు సమన్లు పంపించి అరెస్టు చేస్తుందని ఆమె పేర్కొన్నారు. 'నాకు సన్నిహితుడైన ఒక వ్యక్తి ద్వారా బీజేపీ నన్ను సంప్రదించింది. నా రాజకీయ జీవితం కాపాడుకునేందుకు బీజేపీలో చేరాలని, లేకపోతే నెల రోజుల్లో అరెస్టు అవుతావని చెప్పించింది. కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్, సత్యేందర్ జైన్‌ను అరెస్టు చేసిన తర్వాత ఆప్ విచ్ఛిన్నం అవుతుందని బీజేపీ ఆశించింది. కానీ అలా జరగకపోవడంతో తర్వాత కీలక నాయకులుగా ఉన్న నాతో పాటు సౌరభ్ భరద్వాజ్, రాఘవ్ చద్ధా, దుర్గేశ్ పాఠక్‌ను అరెస్టు చేయించబోతున్నది' అని ఆమె పేర్కొన్నారు.'మేము కేజ్రీవాల్ సైనికులం. భగత్ సింగ్ శిష్యులం. మీ బెదిరింపులకు భయపడబోమని బీజేపీకి చెప్పదలుచుకున్నా. దేశాన్ని రక్షించేందుకు, ప్రజల అభ్యున్నతికి ఆప్ చివరి కార్యకర్త వరకు పోరాడతారు' అని ఆమె స్పష్టం చేశారు.

కేజ్రీవాల్ రాజీనామా చేయరు

ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేయబోరని ఆతిశీ మరోసారి స్పష్టం చేశారు. కేజ్రీవాల్‌పై నేరం నిరూపణ కాలేదని, చార్జ్‌షీట్ కూడా దాఖలు చేయలేదని ఆమె గుర్తు చేశారు. ఢిల్లీ అసెంబ్లీలో ఆప్‌కి పూర్తి మెజారిటీ ఉందని, కాబట్టి కేజ్రీవాల్ రాజీనామా చేయాడానికి ఎలాంటి కారణం లేదని ఆమె పేర్కొన్నారు. మరోవైపు, ఆప్‌కి చెందిన 55 మంది ఎమ్మెల్యేలు మంగళవారం సీఎం కేజ్రీవాల్ సతీమణి సునీత కేజ్రీవాల్‌తో సమావేశమయ్యారు. కేజ్రీవాల్ రాజీనామా చేయొద్దని, జైలు నుంచే ఆయన ప్రభుత్వాన్ని నడిపించాలని ఎమ్మెల్యేలు ఆమెను కోరారు.

జైలులో సీఎం ఆఫీసు కోసం కోర్టుకు ఆప్!

తీహార్ జైలులో ఉన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కార్యాలయంగా వినియోగించుకునేందుకు జైలు ఆవరణలో చిన్న స్థలం కేటాయించాలని కోరుతూ కోర్టును ఆశ్రయించాలని ఆప్ భావిస్తున్నది. ఈ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ సహా ముఖ్యమైన సదుపాయాలు కల్పించాలని కోరనున్నట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

ముడుపుల డబ్బులు ఏవి?

మొదటిపేజీ తరువాయి...

రికవరీ చేయని విషయాన్ని ప్రస్తావించిన కోర్టు.. రూ.2 కోట్ల లంచం ఆరోపణలను ట్రయల్‌లో భాగంగా విచారించవచ్చని పేర్కొన్నది. అయితే, సంజయ్‌కు బెయిల్ ఇచ్చేందుకు ఈడీకి అభ్యంతరాలు లేవని ఆయన తెలపడంతో కోర్టు బెయిల్ మంజూరు చేసింది. సంజయ్ సింగ్ తన రాజకీయ కార్యకలాపాలను కొనసాగించవచ్చని, అయితే, ఈ కేసుకు సంబంధించి మాత్రం ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని కోర్టు ఆదేశించింది. ఈ కేసులో ట్రయల్ పూర్తయ్యే వరకు సంజయ్ సింగ్ బెయిల్‌పై ఉంటారని చెప్పిన సుప్రీంకోర్టు.. స్పెషల్ కోర్టు బెయిల్ షరతులకు లోబడి ఉండాలని సంజయ్ సింగ్‌ను ఆదేశించింది. కాగా, ఈ కేసులో గత ఏడాది అక్టోబరు 4న ఈడీ సంజయ్ సింగ్‌ను అరెస్టు చేయగా అప్పటి నుంచి ఆయన జైలులోనే ఉన్నారు.

అప్రూవర్ల స్టేట్‌మెంట్ల ఆధారంగా కేసు: ఆప్

సంజయ్ సింగ్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని ఆప్ స్వాగతించింది. దేశ ప్రజాస్వామ్యంలో ఇది గొప్ప రోజని అభిప్రాయపడింది. కోర్టు విచారణలో రెండు ముఖ్యమైన అంశాలు ప్రజల ముందుకు వచ్చాయని ఢిల్లీ మంత్రులు సౌరభ్ భరద్వాజ్, ఆతిశీ పేర్కొన్నారు. డబ్బులకు సంబంధించిన ఆరోపణలపై విచారణ గురించి సుప్రీంకోర్టు ప్రశ్నించినప్పుడు ఈడీ నుంచి ఎలాంటి స్పందన రాలేదని, ఈ కేసు మొత్తం అప్రూవర్ల స్టేట్‌మెంట్‌లపై ఆధారపడిందనేది తేటతెల్లమైందన్నారు. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా స్టేట్‌మెంట్లు ఇచ్చేలా అప్రూవర్లను ఒత్తిడికి గురిచేశారని ఆరోపించారు.

11 మంది నక్సలైట్లు హతం

మొదటిపేజీ తరువాయి...

పరిధిలోని అడవులను చుట్టుముట్టాయి. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కోర్‌చోలీ సమీపంలోని లెంద్రా అడవుల్లో తారసపడిన మావోయిస్టు దళాలు జవాన్లపై కాల్పులకు దిగాయి. వెంటనే జవాన్లు అప్రమత్తమై ఎదురు కాల్పులు జరిపారు. రెండు గ్రూపుల మధ్య దాదాపు రెండు గంటల పాటు తుపాకుల మోత మోగింది. ఎన్‌కౌంటర్ అనంతరం భద్రతా బలగాలు ఘటనాస్థలిలో మొత్తం 11 మంది నక్సలైట్ల మృతదేహాలతో పాటు భారీయెత్తున ఆయుధ, వస్తు సామగ్రిని స్వాధీనం చేసుకొన్నారు. సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నదని ఐజీపీ సుందర్‌రాజ్ తెలిపారు. తాజా ఎన్‌కౌంటర్‌లో డీవీసీ మెంబర్ క్రాంతి ముచతోపాటు మరో కీలక సభ్యుడు పాపారావు మృతిచెందినట్లు ప్రాథమిక సమాచారం అందింది. మావోయిస్టులు భారీ సంఖ్యలోనే గాయపడ్డట్లు భద్రతా దళాలు అంచనా వేస్తున్నాయి. కాగా, గత నెల 27న ఇదే బీజాపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు నక్సలైట్లు మరణించిన విషయం తెలిసిందే. తాజా ఘటనతో ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ రీజియన్‌లో వేర్వేరు ఎన్‌కౌంటర్లలో మొత్తం 43 మంది నక్సలైట్లు మృతిచెందారు.

సరిహద్దు జిల్లాలో మరో ఆపరేషన్

మధ్యప్రదేశ్‌లోని ఛత్తీస్‌గఢ్ సరిహద్దు జిల్లా బాలాఘాట్‌లో పోలీసుల ఎన్‌కౌంటర్‌లో ఒక మహిళతో సహా ఇద్దరు నక్సలైట్లు మరణించారు. పలు క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న వీరిద్దరిపై రూ.43 లక్షల నగదు రివార్డు కూడా ఉన్నది. కేర్జారి అటవీ ప్రాంతంలో సోమవారం రాత్రి 9 గంటల సమయంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగిందని అధికారులు తెలిపారు. బాల్‌ఘాట్‌లో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్ ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో డాబ్రీ-పిత్‌కోన సమీపంలోని కేర్‌జారీ అడవుల్లో మావోయిస్టులు తారసపడ్డారు. ఎన్‌కౌంటర్‌లో మృతిచెంది వారిలో ఒకరు రూ.29 లక్షల రివార్డు ఉన్న డీవీసీఎం సజంతి అలియాస్ క్రాంతి కాగా.. మరొకరు రూ.14 లక్షల రివార్డు ఉన్న ఏరియా కమిటీ సభ్యుడు రఘు అలియాస్ శేషన్నాగా పోలీసులు గుర్తించారు.

యుద్ధ సమయంలో అలాంటివి జరుగుతయ్

- గాజాలో అంతర్జాతీయ సహాయ కార్మికుల మృతిపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ విచారం
- మృతుల్లో ఒకరు భారత సంతతి ఆస్ట్రేలియా మహిళ

జెరూసలేం, ఏప్రిల్ 2: గాజాలోని వరల్డ్ సెంట్రల్ కిచెన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఏడుగురు అంతర్జాతీయ సహాయ కార్మికులు మరణించడంపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన దురదృష్టకరమని, అనుకోకుండా జరిగిందని పేర్కొన్నారు. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. యుద్ధ సమయంలో ఇలాంటి ఘటనలు జరుతుంటాయని పేర్కొన్నారు. కాగా, మృతుల్లో ఒకరు భారత సంతతి ఆస్ట్రేలియా మహిళ జోమి ఫ్రాంక్‌కామ్ ఉన్నారని అక్కడి అధికారిక వర్గాలు మంగళవారం ప్రకటించాయి. దీనిపై ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐడీఎఫ్ బలగాలే ఇందుకు బాధ్యత వహించాలని హెచ్చరించారు. తమ లొకేషన్, ఇక్కడ పనిచేస్తున్న కార్మికుల కదలికల సమాచారం ఐడీఎఫ్‌తో పంచుకున్నామని, అయినప్పటికీ వరల్డ్ సెంట్రల్ కిచెన్‌పై ఐడీఎఫ్ దాడులకు తెగబడిందని ఫుడ్ చారిటీ ఆరోపించింది.

ప్రతీకార దాడులు తప్పవు

ఇజ్రాయెల్‌కు ఇరాన్ హెచ్చరిక

టెహ్రాన్, ఏప్రిల్ 2: సిరియా రాజధానిలోని తమ దేశ రాయబార కార్యాలయంపై సోమవారం జరిగిన దాడికి ప్రతీకార దాడులు తప్పవని ఇజ్రాయెల్‌ను ఇరాన్ హెచ్చరించింది. డమాస్కస్‌లోని ఇరాన్ ఎంబసీపై సోమవారం ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఇద్దరు ఇరాన్ జనరల్స్ సహా ఏడుగురు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం రాత్రి అత్యవసరంగా సమావేశమైన ఇరాన్ జాతీయ భద్రతా మండలి.. ఇజ్రాయెల్ దాడులకు తగిన బదులివ్వాలని నిర్ణయించినట్టు ఆ దేశ ప్రభుత్వ టీవీ వెల్లడించింది. అయితే ఇజ్రాయెల్‌పై ఇరాన్ నేరుగా తలపడుతుందా అన్నదానిపై స్పష్టతలేదు

ఇస్తాంబుల్ నైట్‌క్లబ్‌లో ఘోర అగ్ని ప్రమాదం

29 మంది మృతి

అంకారా, ఏప్రిల్ 2: టర్కీలో అతిపెద్ద నగరం ఇస్తాంబుల్‌లోని ఓ నైట్ క్లబ్‌లో మంగళవారం ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఆధునీకరణ పనులు చేస్తుండగా అగ్ని ప్రమాదం సంభవించిందని, ఈ ఘటనలో కనీసం 29 మంది చనిపోయారని స్థానిక మీడియా పేర్కొన్నది. ఈ ఘటనకు సంబంధించి నైట్ క్లబ్ మేనేజర్లను, మరికొంత మందిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నట్టు ప్రభుత్వ అధికారులు వెల్లడించారు. 16 అంతస్తుల నివాస భవనం గ్రౌండ్, బేస్‌మెంట్ ఫ్లోర్‌లోని 'మస్కరాడె నైట్ క్లబ్'ను ఆధునీకరణ కోసం మూసేశారు. ఇస్తాంబుల్ గవర్నర్ దావుత్ గుల్ ఘటనా స్థలంలో మీడియాతో మాట్లాడుతూ, అగ్ని ప్రమాదానికి గల కారణం ఏంటన్నది ఇంకా తెలియరాలేదని, దీనిపై దర్యాప్తు సాగుతున్నదని అన్నారు.



కృత్రిమ సూర్యుడి పరీక్షల కోసం ఉపయోగించిన అడ్వాన్స్‌డ్ రిసెర్చ్ పరికరం

కృత్రిమ సూర్యుడి కొత్త రికార్డు

సియోల్, ఏప్రిల్ 2: కేంద్రక సంలీన ప్రక్రియ(న్యూక్లియర్ ఫ్యుజన్)లో తమ కృత్రిమ సూర్యుడు కొత్త రికార్డు సృష్టించినట్టు దక్షిణ కొరియాకు చెందిన శాస్త్రవేత్తలు వెల్లడించారు. కొరియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యుజన్ ఎనర్జీలోని కేస్టార్(దీనినే కృత్రిమ సూర్యుడు అని పిలుస్తారు)లో అణు సంలీయ ప్రక్రియ ద్వారా 48 సెకన్ల పాటు 100 మిలియన్ డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను ఉత్పత్తి చేసినట్టు ప్రకటించారు. ఇది సూర్యుడి మధ్యభాగంలో ఉండే ఉష్ణోగ్రత కంటే దాదాపు ఏడు రెట్లు ఎక్కువ. ఇంతకుముందు 2021లో 30 సెకన్ల పాటు ఈ ఉష్ణోగ్రతను ఉత్పత్తి చేయగా ఆ రికార్డును ఇప్పుడు అధిగమించినట్టు చెప్పారు. 2026 నాటికి 300 సెకన్ల పాటు 100 మిలియన్ డిగ్రీల ఉష్ణోగ్రతను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు శాస్త్రవేత్తలు తెలిపారు.

ఆయుష్మాన్‌తో సీజీహెచ్ఎస్ ఐడీ లింక్ తప్పనిసరి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: ఏప్రిల్ 1 నుంచి కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్) లబ్ధిదారుల ఐడీని ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఖాతా (ఏబీహెచ్ఏ) ఐడీతో అనుసంధానించటాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఈ మేరకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొన్నది. ఇప్పటికే ఉన్న లబ్ధిదారులు తమ సీజీహెచ్ఎస్ ఐడీని 30 రోజుల్లోపు అభా ఐడీతో లింక్ చేయాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు సమగ్ర ఆరోగ్య సంరక్షణ అందించే లక్ష్యంతో 1954లో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్) ప్రారంభించారు. ప్రస్తుతం 75 నగరాల్లో 41 లక్షల మందికి పైగా లబ్ధిదారులు ఈ పథకం కింద ఉన్నారు. ఆయుష్మాన్ భారత్‌ను ప్రధాని నరేంద్ర మోదీ 2018 సెప్టెంబర్ 23న ప్రారంభించారు.

మాస్ జాతరకు సిద్ధం

అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న 'పుష్ప-2' అప్‌డేట్ వెలువడింది. చిత్ర కథానాయకుడు అల్లు అర్జున్ జన్మదినం సందర్భంగా ఈ నెల 8న టీజర్‌ను విడుదల చేయబోతున్నట్లు నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ప్రకటించింది. సోషల్ మీడియా వేదిక ద్వారా ఓ పోస్టర్‌ను పంచుకుంది. దీనికి 'పుష్ప మాస్ జాతర కోసం వేచి చూడండి' అంటూ క్యాప్షన్‌ను జోడించింది. తాజా అప్‌డేట్‌తో బన్నీ అభిమానులు సంబరపడుతున్నారు. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'పుష్ప-2' (ది రూల్) చిత్రంపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలేర్పడ్డాయి. తొలి భాగానికి వచ్చిన అపూర్వ ఆదరణ దృష్ట్యా సీక్వెల్ మేకింగ్‌పై దర్శకుడు సుకుమార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పోస్టర్స్ సోషల్‌మీడియాలో అభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా అల్లు అర్జున్ గంగమ్మ తల్లి గెటప్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆగస్ట్ 15న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.

ప్రభాస్‌తో జోడీగా..?

కీర్తి సురేశ్ చేస్తున్న చేయబోతున్న సినిమాలు నిజంగా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ప్రస్తుతం తమిళంలో రఘుతాత, రివాల్వర్ రీటా, కన్నివెడి సినిమాల్లో నటిస్తున్నది కీర్తి. ఈ మూడు లేడీ ఓరియెంటెడ్ సబ్జెక్ట్‌లే కావడం విశేషం. అలాగే వరుణ్‌ధావన్ హీరోగా రూపొందుతోన్న 'బాబీ జాన్' సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ కూడా ఇచ్చేయనుంది ఈ మహానటి ప్రస్తుతం చేస్తున్న సినిమాల వివరాలివి. తాజాగా తెలుగులో సుహాస్‌తో కలిసి నటిస్తున్నట్టు వార్తలు బలంగా వినిపించాయి. అసలు ఇదేం కాంబినేషన్? కీర్తి ఎలా ఒప్పుకుంది? అంటూ నెటిజన్స్ స్టోరీలు కూడా రాసేస్తున్నారు. అదేగనుక నిజమైతే నిజంగా అది డేరింగ్ డెసిషనే. ఇక అసలు విషయానికొస్తే.. త్వరలో కీర్తి ఓ పాన్ ఇండియా సినిమాలో నటించనుందని విశ్వసనీయ సమాచారం. పైగా అందులో హీరో ప్రభాస్. అవును.. త్వరలో ఈ అందాలభామ ప్రభాస్‌తో జతకట్టనుందనే వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో బలంగా వినిపిస్తున్నది. సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ నటించనున్న 'స్పిరిట్' చిత్రంలో కీర్తి సురేశ్ కథానాయికగా ఎంపికైందట. సంప్రదింపులు కూడా పూర్తయ్యాయని తెలిసింది. మొత్తంగా ప్రభాస్ నుంచి సుహాస్ దాకా.. కోలీవుడ్ నుండి పాన్ ఇండియా దాకా అంతా కవర్ చేసేస్తున్నది ఈ మహానటి.

పోరాటాల విశ్వంభర

చిరంజీవి నటిస్తున్న ఫాంటసీ థ్రిల్లర్ 'విశ్వంభర'. ఓ మహావ్యక్తి జీవితాన్ని, అతను సృష్టించిన అద్భుతాలనూ రెండున్నర గంటల్లో ఆవిష్కరించేంత గొప్ప స్క్రిప్ట్‌ని దర్శకుడు వశిష్ఠ సిద్ధం చేసినట్టు యూనిట్‌వర్గాలు చెబుతున్నాయి. బ్లాక్‌బస్టర్ 'బింబిసార' తర్వాత వశిష్ఠ సంపాదించిన అద్భుతమైన అవకాశం 'విశ్వంభర'. యూవీ క్రియేషన్స్ సంస్థ అత్యంత భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రంలో త్రిష కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఓ షెడ్యూల్ పూర్తి చేశారు. ఈ షెడ్యూల్‌లో కొంత టాకీపార్ట్, ఒక పాట, ఓ యాక్షన్ బ్లాక్‌ని చిత్రీకరించడం జరిగింది. తాజాగా హైదరాబాద్‌లో కీలకమైన యాక్షన్ షెడ్యూల్‌ని ప్రారంభించారు. ఫైట్ మాస్టర్స్ రామ్‌లక్ష్మణ్ ఈ పోరాట సన్నివేశాలను పర్యవేక్షిస్తున్నారు. హైదరాబాద్ అల్యూమిలియం ఫ్యాక్టరీలో, చిరంజీవి, కొంతమంది ఫైటర్స్‌పై హై ఇంటెన్స్ యాక్షన్ సీక్వెన్స్‌ని చిత్రీకరిస్తున్నారు దర్శకుడు వశిష్ఠ. కీలకమైన దశలో వచ్చే ఈ యాక్షన్ సీక్వెన్స్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని దర్శకుడు చెబుతున్నారు. జనవరి 10న విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం.కీరవాణి.

ఇలాంటి కథ రాలేదు

'విభిన్నమైన కోణాలుండే షార్ట్‌ఫిల్మ్ తీసి నన్నునేను నిరూపించుకోవాలనుకున్నాను. ఎందుకంటే షార్ట్ ఫిల్మ్ నిడివి తక్కువ ఉన్నా, ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అయితే.. రాయడం మొదలుపెట్టాక తెలియని ఉద్వేగం. నా ప్రమేయం లేకుండానే స్పాన్ పెరిగిపోయింది. ఇలాంటి కథ తెలుగులో రాలేదని నమ్మకం కుదిరిన తర్వాతే ఫీచర్ ఫిల్మ్ చేయడం జరిగింది' అన్నారు హర్షివ్ కార్తీక్. ఆయనే ప్రధానపాత్రధారిగా స్వీయ దర్శకత్వంలో రచించి, నిర్మించిన చిత్రం 'బహుముఖం'. 'గుడ్, బ్యాడ్ అండ్ ది యాక్టర్' అనేది ఉపశీర్షిక. సస్పెన్స్ డ్రామా థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా హర్షివ్ కార్తీక్ విలేకరులతో మాట్లాడారు. 'ఈ సినిమా కోసం కథక్ నృత్యంలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నా. ఈ సినిమా ఎక్కువశాతం యూఎస్‌లోనే తీశాను. 'మేడిన్ యూఎస్ఏ.. అసెంబుల్ ఇండియా' అనే ట్యాగ్‌తో ప్రమోషన్స్ కూడా అక్కడ స్టార్ట్ చేశాం. ప్రీప్రొడక్షన్ వర్క్ పక్కాగా చేసుకోవడంతో తేలిగ్గా సినిమా తీసేయగలిగాను. సస్పెన్స్, సైకలాజికల్ థ్రిల్లర్స్ ఇష్టపడేవారికి మా సినిమా బాగానచ్చుతుంది' అని తెలిపారు హర్షివ్.

హాస్యనటుడు విశ్వేశ్వరరావు కన్నుమూత

తెలుగు చిత్రసీమను వరుస విషాదాలు వెంటాడుతున్నాయి. కాస్ట్యూమ్ డిజైనర్ 'దాసి' సుదర్శన్, మాటల రచయిత శ్రీరామకృష్ణ మరణ వార్త నుంచి కోలుకోకముందే తాజాగా హాస్య నటుడు విశ్వేశ్వరరావు (62) మంగళవారం చెన్నైలో అనారోగ్యంతో కన్నుమూశారు. విశ్వేశ్వర రావు స్వస్థలం కాకినాడ. బాల నటుడిగా కెరీర్‌ను మొదలుపెట్టారు. పొట్టిప్లీడరు చిత్రంతో సినీ రంగంలోకి అడుగుపెట్టారు. బాల భారతం, నిండు హృదయాలు, భక్త పోతన, బాలమిత్రుల కథ, ఓ సీత కథ, మా నాన్న నిర్దోషి, పట్టిందల్లా బంగారం, అందాల రాముడు, ఇంటిగౌరవం వంటి చిత్రాలు బాల నటుడిగా ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. ప్రముఖ హాస్య నటుడు రాజబాబు చిన్ననాటి పాత్రల్లో ఎక్కువగా నటించేవారు. బాలనటుడిగా 150కిపైగా చిత్రాల్లో నటించారు. అనంతరం కాలంలో ఆయన సహాయ పాత్రల్లో మెప్పించారు. ముఠామేస్త్రీ, ప్రెసిడెంట్ గారి పెళ్లాం, ఆమె కథ, ఆయనకు ఇద్దరు, అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి, మెకానిక్ అల్లుడు, శివాజీ, అవును వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు వంటి చిత్రాల్లో హాస్య నటుడిగా తనదైన ప్రతిభతో మెప్పించారు. సినిమాలతో పాటు 150కి పైగా సీరియల్స్‌లోనూ నటించారు విశ్వేశ్వరరావు. చెన్నై సమీపంలోని ఆయన స్వగ్రామం సిరుశేరిలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అనువాద మాటల రచయిత శ్రీరామకృష్ణ ఇకలేరు

అనువాద చిత్రాల మాటల రచయిత శ్రీరామకృష్ణ(74) కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇటీవలే రామకృష్ణను చెన్నయ్ అపోలో ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి హఠాత్తుగా గుండెపోటు రావడంతో ఆయన తుదిశ్వాస విడిచారు. దాదాపు 300 పై చిలుకు సినిమాలకు శ్రీరామకృష్ణ మాటల రాశారు. అందులో ఎన్నో విజయవంతమైన అనువాద చిత్రాలు ఉన్నాయి. శ్రీరామకృష్ణ స్వస్థలం గుంటూరు జిల్లా తెనాలి. 50ఏళ్ల క్రితమే సినిమామీద మక్కువతో చెన్నయ్‌లో సెటిల్ అయ్యారాయన. శంకర్ దర్శకత్వంలో వచ్చిన జెంటిల్‌మెన్, జీన్స్, అపరిచితుడు, ఒకేఒక్కడు చిత్రాలకు తెలుగు వెర్షన్ డైలాగులు శ్రీరామకృష్ణవే. అలాగే మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన ఎన్నో చిత్రాలకు ఆయన తెలుగు వెర్షన్ డైలాగులు రాశారు. డబ్బింగ్ అనే ఫీల్ రానివ్వకుండా డైలాగులు రాయడం శ్రీరామకృష్ణ ప్రత్యేకత. రజనీకాంత్, కమల్‌హాసన్, మమ్ముట్టి, మోహన్‌లాల్, విక్రమ్, అజిత్ ఇలా హీరోలందరి డబ్బింగ్ సినిమాలకూ తెలుగు వెర్షన్ డైలాగులు రాసిన క్రెడిట్ శ్రీరామకృష్ణది. ఆయన గీత రచయిత, దర్శకుడు కూడా. బాలమురళి ఎం.ఎ., సమాజంలో స్త్రీ చిత్రాలకు దర్శకత్వం కూడా వహించారు. శ్రీరామకృష్ణ మృతి పట్ల టాలీవుడ్, కోలీవుడ్ ప్రముఖులు తీవ్ర సంతాపం వెలిబుచ్చారు. మంగళవారం సాయంత్రం చెన్నయ్‌లో ఆయన అంత్యక్రియలు జరిగాయి.